

ములుగు రూరల్ : జెండాకు వందనం చేస్తున్న ములుగు కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్లు



కృష్ణకాలనీ : జడ్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ.



భూపాలపల్లి రూరల్ : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే



ఏటూరునాగారం : జెండా వందనం చేస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



కృష్ణకాలనీ : జయశంకర్ విగ్రహం వద్ద బతుకమ్మలతో ర్యాలీ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు, సిబ్బంది

# ఆవిర్భావ సంబురం

**ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం**

- **ఊరూరా జాతీయ పతాకాల ఆవిష్కరణ**
- **వేడుకలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు**
- **అమరవీరులకు ఘనంగా నివాళి**

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఊరూరా జాతీయ జెండాలు ఎగురవేసి, రాష్ట్ర గీతం ఆలపించారు. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. అలాగే, కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ దివాకర, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో వెంకటేశ్, ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్ జగదీశ్వర్, మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ గోపాల్‌రావు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క, జడ్పీ కార్యాలయంలో కలెక్టర్, ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో చిత్రమిశ్రా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కాగా, ములుగులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య జెండా ఆవిష్కరించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్, భూపాల్‌పల్లి మున్సిపల్ స్పెషల్ అధికారి విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరే, సింగరేణి జీఎం కార్యాలయంలో జీఎం రాజేశ్వరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. భూపాలపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలబోజు శ్రీనివాస్‌చారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాగా, అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు జెండాలు ఎగురవేశారు. పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కూడా జాతీయ జెండాలతో పాటు పార్టీ జెండాలను ఎగురువేశారు.



ములుగు రూరల్ : జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క



ములుగు రూరల్ : జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



భూపాలపల్లి రూరల్ : అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న పొదెం వీరయ్య



గణపురం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో జెండా వందనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చిట్యాల : జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ తదితరులు



వాజేడు : జెండా ఎగరవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కన్నాయిగూడెం : జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సర్వర్



మొగుళ్లపల్లి : జెండావందనం చేస్తున్న తహసీల్దార్ సునీత



తాడ్వాయి : నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వెంకటాపురం(నూగూరు)లో..



గోవిందరావుపేటలో..

## నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, జూన్ 2 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల కోసం భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలుగు పరీక్షకు 73 మంది, హిందీ పరీక్షకు 11 మంది, ఇంగ్లిష్‌కు 9 మంది, గణితంకు 112 మంది, సామాన్య శాస్త్రం 109 మంది, సాంఘికశాస్త్రం పరీక్షకు 25 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించా రు. ఏమైనా సందేహాలు ఉంటే 98854 62305 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం, జూన్ 2 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 21లోగా ఆన్‌లైన్‌లో ఫీజు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

మహదేవపూర్ జూన్ 2 : మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న బస్ షెల్టర్ వద్ద ఓ వ్యక్తి(60) మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహిత అదృశ్యం

మహదేవపూర్, జూన్ 2 : మండల కేంద్రంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్సై పవన్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొలం శ్యామల మే 28న బయటకి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా శ్యామల ఆచూకీ లభించకపోవడంతో భర్త పొలం మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అదుపు తప్పి బొగ్గు టిప్పర్ బోల్తా

కాటారం, జూన్ 2 : మండలంలోని ధన్వాడ సమీపంలో ప్రధాన రహదారిపై బొగ్గు టిప్పర్ సోమవారం అదుపు తప్పి బోల్తా పడింది. మల్హర్ మండలం తాడిచెర్ల ఓసీపీ నుంచి భూపాలపల్లికి బొగ్గుతో వెళ్తున్న టిప్పర్ కిష్టంపేట స్టేజి సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేయబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో భూపాలపల్లి దవాఖానకు తరలించారు. అయితే, డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం, ఓవర్ లోడు వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

## మంత్రి ప్రసంగిస్తుండగా సొమ్మసిల్లిన కానిస్టేబుళ్లు

ములుగు, జూన్2(నమస్తేతెలంగాణ) : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ములుగులో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగిస్తుండగా పోలీస్ కవాతులో పాల్గొన్న ఇద్దరు కానిస్టేబుళ్లు సొమ్మసిల్లి పడిపోయారు. మంత్రికి పోలీస్ గౌరవ వందనం సమర్పించిన అనంతరం ఆమె ప్రగతి నివేదికను ప్రసంగిస్తుండగా ఒక కానిస్టేబుల్ సొమ్మసిల్లి కింద పడిపోయాడు. వెంటనే అతడిని తోటి సిబ్బంది ఎత్తుకొని వేదిక బయటకు తీసుకొచ్చి సపర్యలు చేయగా స్పృహలోకి వచ్చాడు. కొంత సమయానికి మరో కానిస్టేబుల్ కింద పడిపోతుండగా పక్కన ఉన్న సిబ్బంది అతడిని వేదిక బయటకు తీసుకెళ్లారు. రెండు గంటల పాటు ఎండలో పరేడ్ చేసిన అనంతరం మంత్రి ప్రసంగంలో అటెన్షన్‌లో కదలకుండా ఉండడంతో అస్వస్థతకు గురై కింద పడిపోయారు. కాగా, సభా వేదిక వద్ద ముందస్తు జాగ్రత్తగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయకపోవడం, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం గమనార్హం.

## తెలంగాణ తల్లికి అవమానం!

కన్నాయిగూడెం, జూన్ 2 : మండలంలో అధికారులు తెలంగాణ తల్లిని అవమానించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఏర్పాటు చేయకుండా జిరాక్స్ తీసిన పేపర్ పెట్టడంతో అది గాలికి లేచిపోయింది. కార్యాలయం సిబ్బంది ఒకరు గమనించి జెండా ఆవిష్కరణ అనంతరం తెలంగాణ తల్లి ఫొటో ఉన్న పేపర్ తీసుకొచ్చి అంబేద్కర్ చిత్రపటం వెనకాల పెట్టారు. కాగా, తెలంగాణ తల్లి చిత్రపటం ఏర్పాటు చేయకుండాలో జిరాక్స్ పేపర్ పెట్టడంపై బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు దుర్గం రాజ్‌కుమార్ మండిపడ్డారు. కనీస అవగాహన లేకుండా అధికారులు వ్యవహరించడం బాధాకరమన్నారు. కాగా, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సెల్‌ఫోన్‌లో జయజయహే తెలంగాణ గీతం పెట్టడం, తహసీల్దార్ కార్యాలయం వద్ద తెలంగాణ గీతం మధ్యలోనే ఎంపీడీవో వనిత వెళ్లిపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

## సూర్యాస్తమయమైనా తీయని జాతీయ జెండా

వాజేడు, జూన్ 2 : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వెంకటాపురం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవంలో భాగంగా ప్రిన్సిపాల్ కిరణ్మయి జాతీయ జెండాను సోమవారం ఉదయం ఎగురవేశారు. అయితే, దాన్ని సూర్యస్తమయం లోపు తీసి భద్రపర్చాల్సి ఉండగా రాత్రి 7 గంటలు దాటినా జాతీయ జెండాను తీయలేదు. ఈ విషయంపై ఫోన్‌లో ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా జెండా ఎగరవేసి, పని నిమిత్తం ఏటూర్‌నాగారం వెళ్లానని, అక్కడ సిబ్బందికి జెండాను తీయమని చెప్పానని అన్నారు.

## నష్టపరిహారం ఆలస్యంపై రైతు కమిషన్ చైర్మన్ ఆగ్రహం

ములుగు, జూన్2(నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లాలో మక్కజొన్న విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో జరుగుతున్న ఆలస్యంపై జిల్లా అధికారులపై రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ నుంచి సోమవారం జూమ్ మీటింగ్ నిర్వహించి అధికారులతో మాట్లాడారు. మల్టీనేషనల్ కంపెనీల వ్యవహారంపై అసహనం వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించడంలో జరుగుతున్న ఆలస్యంపై ఆరా తీశారు. విత్తనోత్పత్తి ఘటనలో ఇప్పటి వరకు జరిగిన పురోగతిని కలెక్టర్ టీఎస్ దివాకర వివరించినప్పటికీ లబ్ధిదారులను ఎంపిక చేయడంలో జరుగుతున్న ఆలస్యంపై చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, సీడ్స్ డైరెక్టర్ కేశవులు, రైతు కమిషన్ మెంబర్ భూమి సునీల్, సలహాదారులు రామాంజనేయులు, దొంతి నర్సింహారెడ్డి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం, జూన్ 2 : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రజల నుంచి పీవో చిత్రామిశ్రా వినతులు స్వీకరించారు. మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం మండలాలకు చెందిన గిరిజనులు పాల్గొని తమ వినతులను అందజేశారు. ఐటీడీఏ కోటా నుంచి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని, వెంకటాపురం సీహెచ్‌సీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు ఇప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏవో రాజ్ కుమార్, మేనేజర్ శ్రీనువాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## బెటాలియన్ కమాండెంట్‌గా సుబ్రహ్మణ్యం



గోవిందరావుపేట, జూన్ 2 : మండలంలోని చల్వాయి శివారులోని 5వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి కమాండెంట్‌గా ఉన్న ఆయనను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం కమాండెంట్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబర్చిన బెటాలియన్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

## రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించాలి

- **ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలి.**
- **భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాలపల్లి రూరల్, జూన్ 2 : భూపాలపల్లి జిల్లాలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా, లక్ష్యాలను చేరుకునేలా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించిన సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులను మండలాల వారీగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి సదస్సులో దరఖాస్తులను పక్కాగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లి ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు**

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ములుగు జిల్లాలోని ములుగు, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు), కన్నాయిగూడెం మండలాల్లోని గ్రామాలతోపాటు భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్, గణపురం, చిట్యాల, టేకుమట్ల మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆయా మండలాల తహసీల్దార్లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ములుగు, జూన్2(నమస్తేతెలంగాణ) : ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలో గత నెల 28న సంగరబోయిన సౌందర్య హత్య కేసులో పోలీసుల విచారణలో భర్త లక్ష్మయ్యనే హంతకుడిగా తేలాడు. సోమవారం ఎస్సై వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. జంగాలపల్లికి చెందిన లక్ష్మయ్య భార్య సౌందర్యపై అనుమానం పెంచుకుని 29న తెల్లవారు జామున ఇంట్లో ఆమెతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో సౌందర్యను కిందపడేసి గొంతుపై కాలుతో తొక్కి చంపాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్న తనకు ఏమీ తెలియనట్లు ఇంటి బయట గడియ పెట్టి తన బైక్‌పై ములుగుకు వచ్చాడు. బస్టాండ్ సమీపంలో బైక్ పార్క్ చేసి, హనుమకొండకు పారిపోయాడు. అక్కడికి చేరుకున్న లక్ష్మయ్య భార్యను హత్య చేసిన భయంతో పురుగుల మందు తాగి, విషయాన్ని మడికొండలో ఉంటున్న బంధువులకు చెప్పాడు. వారు చికిత్స నిమిత్తం అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోసులు లక్ష్మయ్య దవాఖాన నుంచి డిశ్చార్జి కాగానే అదుపులోకి తీసుకుని, శనివారం రిమాండ్‌కు తరలించారు.

## బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

కృష్ణ కాలనీ, జూన్ 2 : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే- 1గ్రూప్ ఏజెంట్ వెంకటరమణను బదిలీపై వెళుతుండగా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయనను ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వెంకటరమణ సింగరేణికి విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఎస్ కవీంద్ర, కేటీకే ఓసీ- 2 పీవో భిక్షమయ్య, ఏరియా ఇంజినీర్ ఎర్రన్న, డీజీఎం పర్సనల్ రవికుమార్, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపురం(నూగూరు), జూన్ 2 : నూగూరు శివారులో సోమవారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి, 2వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే, 55 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో పీఎస్సైలు తిరుపతిరెడ్డి, అవినాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అంధకారంలో పలిమెల

**కరెంట్ స్తంభం విరిగినా స్పందించని విద్యుత్ అధికారులు**

**మద్యం మత్తులో ఏఈ**

పలిమెల, జూన్ 2 : పలిమెల మండలంలో 12 గంటలపాటు అంధకారం నెలకొంది. మండలంలోని లెంకలగడ్డ గ్రామంలో వ్యవసాయ భూమిని ట్రాక్టర్ దున్ను తున్న క్రమంలో 33/11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం విరిగింది. దీనిపై సమాచారం అందించినా విద్యుత్ అధికారులు దాదాపు 12 గంటల పాటు మరమ్మతు చేపట్టలేదు. ఈ విషయంపై ఏఈని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా మద్యం మత్తులో ఉన్న ఏఈ 'రాత్రి 12 అయినా కరెంటు రాదు.. ఏం చేసుకుంటావో చేసుకో' అని నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ప్రజలు అడిగినా దుర్భాషలాడుతూ అదే సమాధానం చెప్పాడు. గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ నిత్యం మద్యం తాగుతున్నాడని అతడిపై విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఏఈపై చర్యలు తీసుకుని మండలానికి నాణ్యమైన విద్యుత్ అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉద్యమంలో పాత్రికేయులది కీలక పాత్ర

ములుగు, జూన్2(నమస్తేతెలంగాణ)/ములుగు రూరల్ : తెలంగాణ ఉద్యమంలో పాత్రికేయులది కీలక పాత్ర అని, జిల్లా సాధనలో కూడా వారి పాత్ర మరువలేనిదని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మంజూరు విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నప్పటికీ నిజమైన లబ్ధిదారులకే కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదిన జరిగే మంత్రి మండలి సమావేశంలో నూతన మార్గదర్శకాలను చేయనున్నట్లు తెలిపారు. మేడారం జాతరకు రూ.100కోట్లతో శాశ్వత పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో రూ.1.50కోట్లతో, ఏటూరునాగారంలో రూ.కోటితో మాడల్ మార్కెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ములుగులో ప్రభుత్వ జూనియర్ కళాశాలను గట్టమ్మ వద్ద ఉన్న డిగ్రీ కళాశాలకు తరలించి, ఆ స్థలాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ టీఎస్ దివాకర మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇండ్లు, ఐటీడీఏ పరిధిలో మరో 1500 ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, డీపీఆర్వో రఫిక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ పాల్గొన్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మించిన మాడల్ ఇందిరమ్మ ఇల్లును మంత్రి సీతక్క ప్రారంభించారు. అలాగే, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ర్యాలీని ప్రారంభించారు. అలాగే, వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని కూడా మంత్రి సీతక్క కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు.

## విద్యుత్ స్తంభాలపై కేబుల్స్ సరి చేయాలి

ములుగురూరల్, జూన్ 2 : విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇంటర్నెట్ కేబుల్స్‌ను ఆపరేటర్లు సరిచేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్తంభాలపై ఇంటర్నెట్ వైర్లను అస్తవ్యస్తంగా తగిలించడంతో విద్యుత్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి కేబుల్ ఆపరేటర్ తన పరిధిలో వాడుకుంటున్న విద్యుత్ స్తంభాల వివరాలను బుధవారం అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీఈ వేణుగోపాల్, ఏఈలు, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి ఆయన జేడీమల్లంపల్లిలో పర్యటించి, విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

మంగపేట, జూన్ 2 : అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని మండలంలోని నర్సింహసాగర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడితో కలిసి పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అర్హులైన పేదలను పక్కకు పెట్టి భూములు, ఆస్తులున్న వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని కోరారు.

**జాబితాలో పేరున్నా ఇల్లు లేదంటున్నారు**

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు వచ్చినప్పటికీ స్థానిక అధికారులు ఇప్పుడు లేదని తనను మోసం చేశారని అకినేపల్లిమల్లారానికి చెందిన గిరిజన దంపతులు నాగుల రవి-సమ్మక్క వాపోయారు. ఈ మేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో భూములున్న వారికి, నాలుగు చక్రాల వాహనాలున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, తమకు ఇలా అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. కూలి పనులు చేసుకుంటేనే ఇల్లు గడుస్తుందని తన పరిస్థితిని ఉన్నతాధికారులు అర్థం చేసుకొని ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు.

## గ్యాస్ డబ్బుల పేరుతో మభ్యపెట్టి చోరీ

గణపురం, జూన్ 2 : గ్యాస్ డబ్బులు పడ్డాయా అంటూ ఓ వృద్ధుడిని మభ్యపెట్టి ఇంట్లో చోరీ చేసిన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్లపల్లి పెద్ద రాజయ్య,లక్ష్మి వృద్ధ దంపతులు. సోమవారం లక్ష్మి ఉపాధి పనికి వెళ్లగా పెద్ద రాజయ్య ఇంట్లోనే ఉన్నాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి మీకు గ్యాస్ డబ్బులు పడుతున్నాయా అని రాజయ్యను అడిగాడు. అయితే, మాకు డబ్బులు పడడం లేదని పెద్దరాజయ్య చెప్పాడు. ఇంతలో అతడు గ్యాస్‌ను పరిశీలించాలని ఇంట్లోకి వెళ్లి గ్యాస్ లీకైందని, కిరాణం షాపు వద్దకు వెళ్లి ప్లాస్టర్ తీసుకురావాలని చెప్పగా రాజయ్య వెళ్లాడు. ఇంతలో ఆ వ్యక్తి ఇంట్లోని బీరువా తాళాలు తీసి అందులో ఉన్న రెండు తులాల బంగారు కమ్మలు, 30 తులాల వెండి, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఇంటికి వచ్చిన రాజయ్య బీరువా తెరిచి ఉండడంతో లబోదిబోమన్నాడు. సీసీ కెమెరా పుటేజీని పరిశీలించగా అతడు స్పోర్ట్స్ టీషర్టు వేసుకున్నాడని, దానిపై కుమార్ అని రాసి ఉందని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని గణపురం పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**గాంధీనగర్‌లో..**

మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం ఓ ఇంట్లో తాళం పగులకొట్టి రూ.50 వేల నగదు, తులం బంగారం చోరీ చేశారు. బాధితుడు బొల్ల అశోక్ కథనం ప్రకారం.. గ్రామంలో అశోక్ అతడి భార్య పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.50వేల నగదు, తులం బంగారం కనిపించలేదు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి పోలీసులు, క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మహదేవపూర్, జూన్ 2 : గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై పవన్ కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకే గౌరక్క కొంతకాలంగా మతి స్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్నది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 11 గంటలకు మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డుపై ఓ గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో భూపాలపల్లి వంద పడకల దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గౌరక్క అక్కడే మృతి చెందింది. మృతురాలి కొడుకు సుంకే రాజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE



★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347.

NTW-337079

CHANGE OF NAME

★I, PILLALAMARRI SHIVA (New Name), previously called PILLALAMARI SHIVARAMIAH (Old Name), and R/o H.No. 35-2-1, Gopalpur, Hanamkonda, Hanumakonda District-506015, Telangana State, India, and solemnly declare.

NTW-7714

WANTED

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565